

శంషాబాద్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి దంపతులు



నార్సింగి పోలింగ్ కేంద్రంలో ఓటువేసేందుకు వస్తున్న వృద్ధురాలు



ఓటు హక్కు వినియోగించుకున్న స్థానికులతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఓటింగ్‌ను పరిశీలించి బయటికి వస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



ఓటు హక్కు వియోగించుకొని సిబ్బంది సహాయంతో బయటికి వస్తున్న వృద్ధురాలు



బాబుల్‌రెడ్డినగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలు



బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



కోకాపేట ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

# ముగిసిన పోలింగ్

- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- 44.3 శాతంగా పోలింగ్ నమోదు



బండ్లగూడలో ఓటు హక్కును వినియోగించుకున్న మేయర్ మహేందర్‌గౌడ్ దంపతులు



ఓటు హక్కు వినియోగించుకొని సిరాగుర్తు చూపిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, జడ్పీటీసీ నీరటి తన్వీరాజు దంపతులు

రాజేంద్రనగర్ బృందం: రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ సాధారణ ఎన్నికల సమరం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ మందకొడిగా సాగుతూ గ్రామీణ ప్రాంతాల్లో పుంజుకున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పోలింగ్‌శాతం నమోదు కాకపోవడంతో అభ్యర్థుల్లో అప్పుడే అలజడి నెలకొంది. ఓటింగ్‌లో పాల్గొనాలని పదేపదే అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రకటనలు చేసినప్పటికీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఓటర్లు ఆశించినస్థాయిలో స్పందించకపోవడం, గత శాసనసభ ఎన్నికల కన్నా మరింత తక్కువ కావడం గమనార్హం. అయితే గతంతో పోల్చితే ఈసారి గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంటులల్లో నివాసముంటున్న విజ్ఞానవంతులు ఓటింగ్‌లో పాల్గొనగా...చాలా చోట్ల స్థానిక ప్రజలు ఆశించిన స్థాయిలో పోలింగ్‌లో అంతంత మాత్రంగానే పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2లక్షల 57వేల 795మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా 44.3శాతం ఓటింగ్ నమోదైంది.

గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి,బండ్లగూడ మున్సిపాలిటీల్లో గురువారం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ క్రమేణా పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 161 పోలింగ్ కేంద్రాల్లో 1,79,627 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్‌కు మరో రెండు గంటలే సమయం ఉండటంతో సామాన్యులతో పాటు సెలబ్రిటీలు కూడా పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలు కట్టారు. దీంతో పోలింగ్‌శాతం కొంత మేర పెరిగింది. మధ్యాహ్నం మూడుగంటల వరకు ఈ రెండు మున్సిపాలిటీలల్లో 51శాతం వరకు పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. మొత్తంగా పోలింగ్ శాతం 67శాతం నమోదైంది.

రాజేంద్రనగర్ మండలంలో అత్తాపూర్, రాజేంద్రనగర్, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లల్లో మొత్తం 3,15,054 మంది ఓటర్లు ఉండటంతో 287 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించగా 2500మంది, ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ చేపట్టారు. ఓటింగ్ సజావుగా సాగినప్పటికీ పోలింగ్ బూత్‌లు దొరకకపోవడంతోఓటర్లు ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుతో పోలీసు అధికారులు సైతం మంచి సహకారాన్ని అందించారు.

శాసనసభ ఎన్నికల నిర్వహణలో భాగంగా శంషాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలో 94 పోలింగ్ కేంద్రాల్లో 87,256 మంది ఓటర్లు ఉండగా 58,246 మంది ఓటర్లు గురువారం జరిగిన ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 66.75శాతంగా శంషాబాద్ మున్సిపాలిటీ, మండలంలో నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అత్యధికంగా పాలమాకులల్లో 5,900 ఓట్లకు గాను 89శాతం ఓటింగ్ నమోదైంది.

**మందకొడిగా సాగిన ఓటింగ్..**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం వరకు మందకొడిగానే సాగింది. అత్తాపూర్, కిస్మత్‌పూర్, బండ్లగూడ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల్లో సాంకేతిక కారణాల వల్ల నిర్దేశించిన సమయానికి మించి సాయంత్రం 7 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది.

**మొరాయించిన ఈవీఎంలు..**

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ గ్రామం 149 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించగా దాదాపు గంటపాటు ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనకుండగా నిలిచిపోవాల్సి వచ్చింది. అదేవిధంగా అత్తాపూర్ గ్రామంలోనూ అరగంట పాటు ఈవీఎంలు మొరాయించగా అధికారులు సకాలంలో స్పందించి మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు. అయితే కిస్మత్‌పూర్, ఖానాపూర్, నార్సింగి లాంటి ప్రాంతాలల్లో ఐదు గంటల లోపు పోలింగ్ కేంద్రంలోకి చాలా మంది రావడంతో రాత్రి ఏడుగంటల వరకు ఓటింగ్ కొనసాగింది.

**పోలింగ్ సరళి..**

ఉదయం 9గంటలకు 15.90శాతం, 11గంటలకు 17.23శాతం, మధ్యాహ్నం 1గంటకు 23.5శా తం, 3గంటలకు 34.50శాతం, 5గంటలకు 44.3శాతంగా నమోదైంది.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**

ప్రభుత్వ సలహాదారుడు సోమేశ్ కుమార్ తన ఓటుహక్కును రాజేంద్రనగర్ డివిజన్‌లో వినియోగించుకోగా, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రకాష్‌గౌడ్(బీఆర్‌ఎస్), తోకల శ్రీనివాస్‌రెడ్డి(బీజేపీ)లు తన ఓటు హక్కును మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో వినియోగించుకున్నారు. పుప్పాలగూడలోని పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వివిధ పార్టీల నుంచి కార్పొరేటర్ అభ్యర్థులు ఆయా డివిజన్లలో వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సినీనటులు శివారెడ్డి, ప్రభాకర్, సింగర్ సునీత,పలువురు ఓటుహక్కును వినియోగించుకున్నారు.



లక్ష్మీగూడలో ఓటు హక్కును వినియోగించుకొని సిరాగుర్తు చూపిస్తున్న నాయకులు



అత్తాపూర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద నాయకులతో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్